క్లుప్తంగా

రైతులకు అందుబాటులో జీలుగ విత్తనాలు

బిజినేపల్లి: మండల కేంద్రంలోని ఆగ్రో రైతు సేవా కేంద్రం–5లో 60 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని బిజినేపల్లి వ్యవసాయాధికారి నీతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 30 కిలోల జీలుగ విత్తనాల సంచి సబ్సిడీ పోను రూ.843కు లభిస్తుందని సూచించారు. సబ్సిడీలో విత్తనాలు కావాల్సిన రైతులు పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డుపై ఏఈఓ సంతకంతో కూడిన జిరాక్స్ ఇవ్వాలని సూచించారు.

పెద్దకొత్తపల్లి: వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో సబ్సిడీ జీలుగ విత్తనాలు 25 క్వింటాళ్లు సింగిల్ విండోలో అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయాధికారి రమేశ్ తెలిపారు.

ఆర్‌ఏఆర్‌ఎస్‌లో విత్తనమేళా

బిజినేపల్లి: మండలంలోని పాలెం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో మే 24న విత్తనమేళా నిర్వహించనున్నామని ఏడీఆర్ మల్లారెడ్డి ఒక ప్రకటనలో తెలియజేశారు. వివిధ రకాల పంటలకు సంబంధించిన నాణ్యమైన విత్తనాలు రైతులకు అందుబాటులో ఉన్నాయని, అంతేకాకండా పంటల సమగ్ర సమాచారం కూడా శాస్త్రవేత్తలు అందిస్తారని వివరించారు. పాలెం ఆర్‌ఏఆర్‌ఎస్‌లో ప్రధానంగా వరి, కంది, పెసర, మినుములు లభించనున్నాయని వివరించారు.

భక్తిశ్రద్ధలతో సామూహిక వ్రతాలు

బిజినేపల్లి: పాలెం వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం నిర్వహించిన సత్యనారాయణస్వామి సామూహిక వ్రతాలను భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు రవి రామానుజాచార్యులు భక్తులతో సామూహిక వ్రతాలు శాస్త్రోక్తంగా చేయించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేసి, వారికి స్వామి వారి ఆశీర్వాదాలు అందజేశారు.

కోరం లేక సర్వసభ్య సమావేశం వాయిదా

బిజినేపల్లి: మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీటీసీ సభ్యుల కోరం లేక సమావేశాన్ని వాయిదా వేసినట్లు ఎంపీడీఓ పవన్‌కుమార్ తెలిపారు. ఎంపీపీ శ్రీనివాస్‌గౌడ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన మండల సర్వసభ్య సమావేశానికి ఆరుగురు మాత్రమే ఎంపీటీసీ సభ్యులు రావడంతో ఈ సమావేశాన్ని వాయిదా వేశారు. ఆయా శాఖలకు చెందిన అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు తక్కువ సంఖ్యలో పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్‌కు అంతర్జాతీయ అవార్డు



కల్వకుర్తి రూరల్: లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్ ఆధ్వర్యంలో చేపడుతున్న సామాజిక సేవా కార్యక్రమాలకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. వందశాతం మాడల్ క్లబ్‌గా లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్ నిలిచిందని క్లబ్ అధ్యక్షుడు బైరి కర్ణాకర్‌రెడ్డి, పీఆర్‌ఓ పాష తెలిపారు. ఇంటర్నేషనల్ ప్రస్తుత అధ్యక్షుడు హీరా, మాజీ అధ్యక్షుడు ఫ్రాంక్ మోరీలు ఈ అవార్డును పంపించారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్ అంతర్జాతీయంగా అవార్డు రావడం ఆనందంగా ఉందని అధ్యక్షుడు కర్ణాకర్‌రెడ్డి, కన్వీనర్ భాస్కర్‌రెడ్డి చెప్పారు. క్లబ్ పరిధిలో ఉన్న ప్రముఖ వ్యక్తులు సహకారం అందించిన అందరికి కర్ణాకర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

హజ్ యాత్రికులకు సన్మానం

కల్వకుర్తి రూరల్: పట్టణంలోని రాయల్ ఫంక్షన్ హాల్‌లో ఎంఐఎం ఆధ్వర్యంలో హజ్ యాత్రికులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఐఎం పట్టణాధ్యక్షుడు అబ్దుల్ సత్తార్ మాట్లాడారు. పవిత్ర మక్కా యాత్రకు వెళ్లలనే కోరిక ముస్లింగా పుట్టిన ప్రతిఒక్కరికీ ఉంటుందన్నారు. హజ్ యాత్రికులను సన్మానించడం ఆనందంగా ఉందని చెప్పారు. కార్యక్రమంలో ఖుద్దూస్, మదర్, యాసీర్ తాజ్, నాసీర్ తదితరులు ఉన్నారు.

కోఆర్డినేటర్‌గా రామరాజుయాదవ్

కొల్లాపూర్: ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్‌ప్రిన్స్‌పాల్ రామరాజు యాదవ్ పాలమూరు యూనివర్సిటీ కోఆర్డినేటర్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు ఆయనకు యూనివర్సిటీ ఉత్తర్వులు అందాయి. రామరాజుయాదవ్‌ను శనివారం డిగ్రీ కళాశాల ప్రిన్స్‌పాల్ డా.మల్లేశంతో పాటు అధ్యాపకులు శాలువాలు, పూలమాలలతో సత్కరించారు.

ఎల్‌ఓసీ అందజేత

తాడూరు: మండలంలోని గోవిందాయిపల్లికి చెందిన మల్లయ్య కొన్ని రోజుల నుంచి మోకాళ్ల నొప్పులతో బాధపడుతున్నాడు. ఆపరేషన్ నిమిత్తం ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి రూ.లక్ష ఎల్‌ఓసీ లెటర్‌ను శనివారం అందజేశారు. కార్యక్రమంలో బాధితుడు మల్లయ్యతో పాటు ఎల్లయ్య, బద్రీ తదితరులు పాల్గొన్నారు.

గాలివాన బీభత్సం

- విరిగిపడిన చెట్లు
- పిడుగుపాటుకు వేర్వేరు చోట్ల రెండు ఆవులు మృతి

ఉప్పునుంతల: మండలంలో శనివారం సాయంత్రం ఉరుములతో కూడిన గాలివాన బీభత్సం సృష్టించింది. బలంగా వీచిన గాలితో పాటు భారీ వర్షం కురిసింది. గాలికి చెట్లు విరిగిపడ్డాయి. మండలంలో వేర్వేరు చోట్ల పిడుగులు పడి రెండు పాడి ఆవులు చనిపోయాయి. ఉప్పునుంతల సమీపంలోని వ్యవసాయ పొలంలో తుమ్మచెట్టు కింద కట్టేసి ఉంచిన రైతు రక్త పర్వతాలుగౌడ్‌కు చెందిన రూ.40 వేలు విలువ చేసే ఆవు పిడుగుపాటుకు మృత్యువాతపడగా.. అయ్యవారిపల్లిలో రైతు నారాయణరెడ్డికి చెందిన రూ.60 వేలు విలువ చేసే జెర్సీ పాడి ఆవు పిడుగుపాటుకు గురై మృతిచెందింది. ఆయా గ్రామాల్లో కోతకు సిద్ధగా ఉన్న వరి పంటకు నష్టం వాటిల్లింది. ఉరుములతో కూడిన గాలి వర్షానికి ప్రజలు ఆందోళనకు గురయ్యారు.

పిడుగుపాటుకు కాడెద్దు, ఆవు మృతి..

బల్మూర్: మండలంలోని అనంతవరం శివారులో శనివారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కురిసిన వర్ష బీభత్సానికి పిడుగు పాటుకు గురై ఓ రైతుకు చెందిన కాడెద్దు, ఆవు మృతిచెందిన సంఘటన చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన సాయిలు తన వ్యవసాయ పొలం వద్ద పశువులను మేపుతుండగా.. ఒక్కసారిగా ఉరుములతో కూడిన వర్షం రావడంతో చెట్టుకింద ఉన్న పశువులపై పిడుగు పడింది. దీంతో కాడెద్దు, ఆవు అక్కడికక్కడే ప్రాణాలు విడిచాయని బాధిత రైతు వాపోయాడు. మృతి చెందిన పశువుల విలువ సుమారు రూ.1.30లక్షలు ఉంటుందని రైతు విలపించాడు.

ఒక్క సారిగా చల్లబడిన వాతావరణం..

లింగాల: మండల కేంద్రంలో, మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో శనివారం సాయంత్రం కురిసిన చిరుజల్లులతో ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. వారం రోజులుగా ఉక్క పోతతో తీవ్ర ఇబ్బందులకు గురైన ప్రజలు వాతావరణంలో వచ్చిన మార్పులతో ఊపిరి పీల్చుకున్నారు. ఇదిలా ఉండగా బలమైన ఈదురుగాలులతో మామిడి తోటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. కొన్ని గంటల పాటు విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడింది.



ఉప్పునుంతల సమీపంలో పిడుగుపాటుకు మృతిచెందిన పాడి ఆవు

ప్రయోజనం చేకూరే పనులు చేపట్టాలి

ఉప్పునుంతల: జాతీయ ఉపాధిహామీ పథకంలో పది మందికి ప్రయోజనం చేకూరే కమ్యూనిటీ పనులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎంపీడీఓ లక్ష్మణ్ రావు ఈజీఎస్ అధికారులకు సూచించారు. శనివారం మండలంలోని గువ్వలోనిపల్లిలో కొనసాగుతున్న ఈజీఎస్ పనులను ఎంపీడీఓ పరిశీలించి రైతులు, కూలీలతో ఎంపీడీఓ మట్లాడారు. మర్రి కుంట సమీపంలో రైతుల పొలాలకు వెళ్లే రోడ్డు పనులను పూర్తి చేయించాలని రైతులు, ఎంపీడీఓను కోరారు. చవుడు నేల కావడంతో రోడ్డుకు సరిపడ మట్టి లభించడంలేదని ఈజీఎస్ టీఏ సింగోటం ఎంపీడీఓకు వివరించారు. రైతుల కోరిక మేరకు రోడ్డు పనులను పూర్తి చేయించాలని ఈజీఎస్ ఏపీఓకు ఎంపీడీఓ సూచించారు. అనంతరం ఎంపీడీఓ కూలీలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున ఉదయాన్నే వెళ్లి మధ్యాహ్నం వరకు నిర్ధేశించిన పనులు పూర్తి చేసుకోవాలని సూచించారు. కూలీలకు ఓఆర్‌ఎస్ పాకెట్లను పంపిణీ చేశారు. ఈజీఎస్ ఏపీఓ సుదర్శన్‌గౌడ్, టీఏ సింగోటం, ఫీల్డ్ అసిస్టెంట్ రాము ఉన్నారు.



గువ్వలోనిపల్లిలో ఈజీఎస్ కూలీలకు ఓఆర్‌ఎస్ పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ లక్ష్మణ్‌రావు

కల్వకుర్తి రూరల్: మండలంలోని వెంకటాపూర్, ఎల్లికట్ల, వెంకటాపూర్ తండా గ్రామాల్లో శనివారం ఎంపీడీఓ ఆంజనేయులు ఉపాధిహామీ పనులను పరిశీలించారు. ఆయా గ్రామాల్లో కూలీలు చేస్తున్న చెరువు మట్టి తొలగింపు, గ్రామాల్లో మరుగుదొడ్ల నిర్మాణం పనులను పరిశీలించి లబ్ధిదారులతో ఎంపీడీఓ మాట్లాడారు. ఎంపీఓ దేవేందర్, ఏపీఓ చంద్రసిద్ధార్థ్, ఎంపీటీసీ శంకర్‌నాయక్, సర్పంచ్‌లు వెంకటేశ్వర్లు, రమేశ్ తదితరులు ఉన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



కల్యాణలక్ష్మి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

కల్వకుర్తి: పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ఆవరణలో ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ కల్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రంలోని ఆడపడుచుల వివాహానికి రూ.1,00,016 ఆర్థిక సాయం అందించి వారి పెద్దన్నగా మారాడని కొనియాడారు. అభివృద్ధి, సంక్షేమం ధ్యేయంగా రాష్ట్రంలో పరిపాలన కొనసాగిస్తున్నామని ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ చెప్పారు. అనంతరం మండలంలోని మార్చాలకి చెందిన శారదకు మంజూరైన రూ.18 వేల సీఎం సహాయనిధి చెక్కును అందజేశారు. జిల్లా పరిషత్ చైర్మన్ శాంతాకుమారీ, మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, మనోహరా చెన్నకేశవులు, వైస్ ఎంపీపీ గోవర్ధన్, జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.

చెత్త రహిత పట్టణంగా తీర్చిదిద్దండి

కొల్లాపూర్: మున్సిపాలిటీ చెత్తరహిత పట్టణంగా తీర్చిదిద్దేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి కమిషనర్ రాజయ్య కోరారు. శనివారం పట్టణంలోని పలు వార్డుల్లో పారిశుద్ధ్య కార్యక్రమాల్లో భాగంగా మున్సిపల్ సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. వార్డులో పారిశుద్ధ్య నిర్వహణపై వివరించారు. తడి, పొడి చెత్తను వేరు చేసే పద్ధతులను తెలియజేశారు. చెత్తను రోడ్లపై పారవేయ్యకుండా మున్సిపాలిటీకి సంబంధించిన చెత్త బండ్లలో వేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బందితో పాటు మహిళ సంఘాల సభ్యులు ఉన్నారు.

పారిశుద్ధ్య కార్మికుడికి పరామర్శ..

కొల్లాపూర్ పట్టణంలో పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తుండగా... స్వామి అనే కార్మికుడు ప్రమాదానికి గురయ్యాడు. ప్రమాదంలో అతనికి కాలు విరిగింది. స్వామిని తోటి కార్మికులు వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, కమిషనర్ రాజయ్య బాధితుడిని పరామర్శించారు. వైద్య ఖర్చుల నిమిత్తం రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు.



పారిశుద్ధ్య నిర్వహణపై వివరిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్

పార్కుల నిర్మాణాల పరిశీలన..

పట్టణంలోని బండాయిగుట్ట వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద, నాలుగో వార్డులో నూతనంగా నిర్మిస్తున్న పబ్లిక్ పార్కుల నిర్మాణ పనులను శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి పరిశీలించారు. నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఆమె వెంట కౌన్సిలర్ పసుపుల కృష్ణ తదితరులు ఉన్నారు.

మహిళ మెడలోంచి బంగారు గొలుసు చోరీ

అచ్చంపేట రూరల్: పట్టణంలోని బస్టాండ్ సమీపంలో ఓ మహిళ మెడలోని బంగారు గొలుసును గుర్తు తెలియని వ్యక్తులు అపహరించిన సంఘటన శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని ఓ కాలనీలో నివాసం ఉంటున్న జయ వస్త్ర దుకాణంలో పని చేస్తుంది. సాయంత్రం ఇంటికి వెళ్తుండగా బైక్‌పై ఇద్దరు వ్యక్తులు వచ్చి మహిళ మెడలోని రెండున్నర తులాల బంగారు గొలుసును లాక్కొని వెళ్లారు. మహిళలు కేకలు వేయడంతో చుట్టు పక్కల వారు గుమిగూడారు. పోలీసులు అక్కడికి వచ్చి బాధితురాలితో మాట్లాడారు. బాధితురాలు అచ్చంపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

లారీ, ఆటో ఢీ: ఇద్దరికి గాయాలు

బల్మూర్: మండలంలోని కొండనాగుల సమీపంలో అచ్చంపేట రహదారిపై శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. మండలంలోని మైలారానికి చెందిన శ్రీనివాసులు, సుధాకర్ కలిసి ఆటోలో అచ్చంపేట వైపు నుంచి స్వగ్రామానికి వెళ్తున్నారు. బల్మూర్ వైపు నుంచి వస్తున్న లారీ ఆటోను ఢీకొట్టడంతో సుధాకర్ కాలు విరిగింది. శ్రీనువాసులుకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను అచ్చంపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా.. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలియజేశారు.

దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు

అచ్చంపేట రూరల్: అకారణంగా దాడి చేసిన వ్యక్తిపై శనివారం సిద్దాపూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని మన్నెవారిపల్లికి చెందిన రాములు భార్య రామాంజలికి అదే గ్రామానికి చెందిన నాగరాజు అనే యువకుడు ఫోన్ చేసి వేధిస్తున్నాడు. మాట్లాడకుంటే చంపేస్తానని బెదిరించాడు. శనివారం ఉదయం భార్యాభర్తలు ఇంట్లో ఉన్న సమయంలో నాగరాజు వచ్చి రాములును తిట్టి దాడి చేస్తుండగా.. రామాంజలి అడ్డుపడింది. రామాంజలిని నాగరాజు కాలితో తన్ని కర్రతో దాడి చేయగా.. స్వల్ప రక్తగాయమైంది. రామాంజలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సిద్దాపూర్ హెడ్‌కానిస్టేబుల్ రెడ్యానాయక్ తెలియజేశారు.

ఫర్టిలైజర్ దుకాణంలో చోరీ

నాగర్‌కర్నూల్ క్రైం: ఫర్టిలైజర్ దుకాణంలో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన సంఘటన జిల్లా కేంద్రంలో శుక్రవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. జిల్లా కేంద్రంలోని పాత మార్కెట్ సమీపంలోని నాగార్జున ఫర్టిలైజర్ దుకాణంలో గుర్తుతెలియని వ్యక్తులు షెట్టర్ తాళం విరగొట్టి అందులోకి ప్రవేశించి బీరువాలోని రూ.2 లక్షల నగదును చోరీ చేశారు. అదేవిధంగా కమీషన్ ఏజెంట్ శంకర్ దుకాణంలో రూ.15 వేలు చోరీ చేశారు. నాగార్జున ఫర్టిలైజర్ యజమాని రాజేందర్ దుకాణాన్ని శనివారం ఉదయం తెరవడంతో వస్తువులు చిందరవందర పడి ఉన్నాయి. బీరువా తెరిచి ఉండటంతో చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. క్లూస్‌టీం సంఘటన స్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించారు. సంఘటనకు సంబంధించి బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలియజేశారు.

మాజీ ఎంపీటీసీ మృతికి సంతాపం

కొల్లాపూర్: పట్టణానికి చెందిన మాజీ ఎంపీటీసీ సభ్యుడు బుసనమోని పాండు (50) శనివారం మధ్యాహ్నం హఠన్మరణం చెందాడు. ఆయనకు చాతిలో నొప్పి రావడంతో వెంటనే స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆయన మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పాండు స్థానిక ప్రజాప్రతినిధిగా తెలుగు, గంగపుత్ర, బీసీ నాయకుడిగా గుర్తింపు పొందాడు. ఆయన మృతికి ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డా.పగిడాల శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ పెబ్బేటి కృష్ణయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, బీఆర్‌ఎస్ నాయకులు జాఫర్, కాటన్ జమ్మలయ్య, చంద్రశేఖరాచారి, కాంగ్రెస్ నాయకులు రంగినేని జగదీశ్వర్లు, రాముయాదవ్ పలువురు నాయకులు సంతాపం ప్రకటించారు.

రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మ దహనం చేసి నిరసన వ్యక్తం చేస్తున్న కురుమ యాదవ బీఆర్‌ఎస్ నాయకులు

తెలకపల్లి: కురుమ యాదవ బీఆర్‌ఎస్ నాయకులు శనివారం మండల కేంద్రంలో నిరసన వ్యక్తం చేశారు. ఇటీవల టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి మంత్రి తలసాని యాదవ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ.. నిరసన వ్యక్తం చేశారు. రాజకీయ పార్టీలో ఉన్నత స్థాయిలో ఉండి మరో పార్టీ నాయకుడిపై ఇలాంటి అనుచిత వ్యాఖ్యలు చేయడం సరైంది కాదన్నారు. తలసాని శ్రీనివాస్ యాదవ్‌పై చేసిన వ్యాఖ్యలకు నిరసనగా మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ కురుమయాదవ నాయకులు రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. బండ పర్వతాలు, చెన్న నర్సింహ, జమ్ములు, ఎంపీపీ కొమ్ము మధు, రమేశ్, శ్రీను పాల్గొన్నారు.

తండాల అభివృద్ధికి ఫౌండేషన్ కృషి

వెల్దండ: మండల పరిధిలోని పల్లుతండాలో నూతనంగా సీసీరోడ్ల నిర్మాణానికి ఎన్‌ఆర్‌ఐ, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలోని గిరిజన తండాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు పేర్కొన్నారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేద ప్రజలకు అండగా ఉండి విద్య, వైద్యం, ఉపాధి కల్పనకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించడానికి ఉచితంగా అంబులెన్స్ సేవలను అందిస్తున్నామన్నారు. ఇటీవల యువతకు ఉద్యోగ కల్పనకు ఫౌండేషన్ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించామన్నారు. రాబోయే రోజుల్లో మహిళలకు స్వయం ఉపాధికోసం శిక్షణ అందిస్తామన్నారు. సర్పంచ్ బక్యానాయక్, నాయకులు రమేష్‌నాయక్, లాల్‌నాయక్, కొండల్‌యాదవ్, మల్లయ్య, చంద్రశేఖర్, జగన్ తదితరులు ఉన్నారు.



పల్లుతండాలో నూతన సీసీరోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న రాఘవేందర్‌రెడ్డి

ధ్యానం చేయడంతో సంపూర్ణ ఆరోగ్యం



మల్లేశ్వరంలో అవగాహన కల్పిస్తున్న . ధ్యాన ప్రచార కార్యకర్తలు

పెంట్లవెల్లి: మండలంలోని ఎంగంపల్లి, మల్లేశ్వరం, వేముకల్, మంచాలకట్ట, మాధవస్వామి నగర్ గ్రామాల్లో ధ్యానంపై ప్రజలకు పిరమిడ్ స్పిరీచ్యువల్ సొసైటీ ప్రచారకార్యదర్శి ఆంజనేయరెడ్డి, తిరుపతయ్య ఆయా గ్రామాల ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఈ మధ్యకాలంలో చాలా మంది ప్రజలు, యువకులకు గుండె జబ్బులు వస్తున్నాయని, ప్రతిఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలంటే రోజూ ధ్యానం చేయడం ఎంతో అవసరమన్నారు. దాంతో గుండెజబ్బు, బీపీ, షుగర్, క్యాన్సర్ వంటి వ్యాధులను తగ్గించుకోవచ్చని, ప్రజలందరూ ప్రతిరోజూ ఒక గంట సమయాన్ని ధ్యానం కోసం ఉపయోగించాలని, దాని ద్వారా సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని, దీని ద్వారా భవిష్యత్‌లో ఎలాంటి ప్రమాదకరమైన వ్యాధులు రాకుండా నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో పిరమిడ్ సంస్థ సభ్యులు బాలకృష్ణారెడ్డి, వెంకటేశ్వర్లు, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

కొల్లాపూర్ రూరల్: మండల పరిధిలోని సోమశిలలో పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ ఆధ్వర్యంలో ధ్యానంపై సొసైటీ ధ్యాన ప్రచార కార్యదర్శి ఆంజనేయ రెడ్డి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆరోగ్యమే మహాభాగ్యం అనే పవిత్ర వాక్యం ధ్యానం ద్వారా రుజువు అవుతుందన్నారు. ప్రతి నిత్యం శ్వాస మీద ధ్యాస పెట్టి ధ్యానం చేయాలని సూచించారు. నిత్యజీవితంలో అనేక సమస్యలతో సతమతమవుతూ.. ఎంతో ఒత్తిడికి గురయ్యే వారు ధ్యానం ద్వారా మానసిక ప్రశాంతతను పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ధ్యాన ప్రచారకర్త సత్యనారాయణతో పాటు గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పరీక్ష నిర్వహించే ఆలోచన విరమించుకోవాలి



మాట్లాడుతున్న కళావతి

నాగర్‌కర్నూల్ రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఆశా వర్కర్లకు పరీక్షలు పెట్టి అందులో అర్హత సాధించిన వారినే కొనసాగించి, మిగతా వారిని తీసి వేయాలనే ఆలోచనను విరమించుకోవాలని ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కళావతి డిమాండ్ చేశారు. శనివారం సీఐటీయూ కార్యాలయంలో జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. 16 సంవత్సరాలుగా గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు అందుబాటులో ఉంటూ వారికి వైద్యం చేస్తూ.. గ్రామీణ ప్రాంత ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతున్న ఆశా వర్కర్లపై ఇలాంటి అనాలోచిత విధానాన్ని అమలు చేయడం దుర్మార్గమని అన్నారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పర్వతాలు, అశోక్, ఆశ వర్కర్ యూనియన్ నాయకురాలు జ్యోతి, విజయ, అలివేల తదితరుల పాల్గొన్నారు.

ఆన్‌లైన్ క్విజ్ పోటీల్లో పాల్గొనండి

కొల్లాపూర్: తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం జూన్ 2 సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించే ఆన్‌లైన్ క్విజ్ పోటీల్లో నిరుద్యోగులు పాల్గొనాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకులు రంగినేని జగదీశ్వరుడు కోరారు. శనివారం కాంగ్రెస్ నాయకులు కొల్లాపూర్‌లో విలేకరులతో మాట్లాడారు. క్విజ్ కాంపిటీషన్‌లో 16 నుంచి 35 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న యువతి, యువకులు పాల్గొనవచ్చన్నారు. సెల్ నంబర్ 7661899899 కు మిస్‌డ్ కాల్ ఇవ్వాలన్నారు. వారు ఇచ్చే లింక్ ద్వారా కాంపిటీషన్‌లో పాల్గొన్నారు. సమావేశంలో ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అక్బర్, అన్వేష్‌గౌడ్, యూనూస్, అనిల్‌గౌడ్, సాయి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్ గాంధీ ఆన్‌లైన్ క్విజ్ పోటీల్లో..

పెద్దకొత్తపల్లి: రాజీవ్ గాంధీ ఆన్‌లైన్ క్విజ్ పోటీలను యువకులు సద్వినియోగం చేసుకోవాలని కొల్లాపూర్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఉదయ్‌కుమార్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. హైదరాబాద్ యూత్ కాంగ్రెస్ డిక్లరేషన్‌ను గ్రామాల్లో యువతకు తెలియజేసేందుకు పరీక్ష చేపడుతున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే నిరుద్యోగులకు రూ.4 వేల నిరుద్యోగ భృతిని అందజేస్తామన్నారు. ప్రతి ఏడాది ఉద్యోగాల నోటిఫికేషన్లు జారీ చేస్తామన్నారు. యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రాము, తగిలి కృష్ణయ్య, నాగబాబు, అర్జున్, శివ పాల్గొన్నారు.

వాహనం ఢీకొని వ్యక్తి మృతి

ఊర్కొండ: మండలంలోని రేవల్లికి చెందిన మాల నాగయ్య(43) రోజులాగే తన పని ముగించుకొని స్వగ్రామానికి ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. మాల నాగయ్య వెల్డింగ్ పనిచేస్తూ జీవనం సాగిస్తుంటాడని తెలిపారు. అతనికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నట్లు తెలియజేశారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

వెల్దండ: మండల పరిధిలోని కొట్రకి చెందిన శ్యాంపూరి శ్రీనివాస్ ఇటీవల గుండె పోటుతో మృతిచెందాడు. శనివారం గ్రామ సేవా సమితి ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి 25 కిలోల బియ్యంతో పాటు నిత్యావర సరుకులను అందజేశారు. కుటుంబానికి అండగా ఉంటామన్నారు. వారి పిల్లల చదువులకు సహకారం అందిస్తామన్నారు. గ్రామ సేవా సమితి సభ్యులు రవీందర్‌రావు, నాగరాజుగౌడ్, అర్జున్, బాలచంద్రయ్య, రవీందర్ తదితరులు ఉన్నారు.

వాహనాల తనిఖీ

వెల్దండ: మండల కేంద్రంలో శనివారం హైదరాబాద్‌– శ్రీశైలం జాతీయ రహదారిపై ఎస్‌ఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. ట్రాక్టర్లు, ఆటోలు, బైక్‌లు వాహనదారులు ముందు వెళ్తున్న వాహనాలను దాటే క్రమంలో ప్రమాదాలు జరుగుతున్నట్లు పేర్కొన్నారు. ప్రతి వాహనదారుడు లైసెన్స్‌లు, వాహనాల పూర్తి పేపర్లు ఉంచుకోవాలన్నారు. పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

కోడేరు: మండల కేంద్రంతో పాటు జనుంపల్లి శివారులో ఎస్‌ఐ రాజు శనివారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ప్రతి ద్విచక్ర వాహనదారుడికి తప్పనిసరిగా ఆర్‌సీ, లైసెన్స్‌తో పాటు హెల్మెట్ ఉండాలన్నారు. చిన్న పిల్లలకు వాహనాలు ఇస్తే అటువంటి వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పిల్లలకు వాహనాలు ఇవ్వడంతో ప్రమాదాలు జరిగే ప్రమాదం ఉందన్నారు. అదేవిధంగా మద్యం తాగి ఎవరన్నా.. వాహనాలు నడిపితే డ్రంకెన్‌డ్రైవ్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సిబ్బంది ఉషేన్‌నాయక్, రవినాయక్ పాల్గొన్నారు.

బాల్యవివాహం అడ్డుకున్న అధికారులు

కల్వకుర్తిటౌన్: పట్టణంలోని గాంధీనగర్ కాలనీలో బాల్యవివాహాన్ని ఐసీడీఎస్ అధికారులు శనివారం అడ్డుకున్నారు. కల్వకుర్తి ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి వెంకటమ్మ తెలిపిన వివరాల ప్రకారం. పట్టణంలోని గాంధీనగర్ కాలనీలో నమ్మదగిన సమాచారం మేరకు బాలిక వివాహం జరుగుతున్న విషయాన్ని తెలుసుకొని ఐసీడీఎస్ అధికారి, షీ టీమ్ సంఘటన స్థలానికి వెళ్లారు. మైనర్ వివాహం జరుగుతుండటంతో పెళ్లి ఆపేసి జిల్లా కేంద్రంలోని సఖీ నిలయానికి తరలించారు. గ్రామాల్లో మైనర్ వివాహాలు ఎక్కువగా జరుగుతున్నాయని, ఎవరైనా 1098 కు, లేదా 100కు లేదా జిల్లా షీ టీమ్ అధికారులకు సమాచారం ఇవ్వాలని సీడీపీఓ వెంకటమ్మ తెలియజేశారు. పద్మమ్మ, మధుబాబు, ఉస్సేన్, వెంకటయ్య, వెంకటస్వామి తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వీడ్కోలు సమావేశం



మాట్లాడుతున్న ఏడుకొండలు

కందనూలు: జిల్లా కేంద్రంలోని నెల్లికొండ ప్రభుత్వ(సైన్స్) డిగ్రీ కళాశాలలో జూనియర్ విద్యార్థులు, సీనియర్ విద్యార్థులకు వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో విద్యార్థులు పలు సినిమా పాటలకు నృత్యాలు చేసి అలరించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా ఎక్సైజ్ సీఐ ఏడుకొండలు హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. భవిష్యత్‌లో విద్యార్థులు తీసుకోవాల్సిన నిర్ణయాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందించారు. కళాశాల ప్రిన్సిపాల్ కమర్ షాజహాన్ సుల్తాన మాట్లాడారు. జూనియర్ విద్యార్థులు సీనియర్లకు వీడ్కోలు పలకడం అనేది ఒక ఆనవాయితీ అన్నారు. షేక్ ఖాజాబీ అధ్యాపకులు పాల్గొన్నారు.

స్థలం పరిశీలన



తాడూరు: మండల కేంద్రంలోని సర్వే నంబర్ 263లో వెంచర్ ప్రారంభించారు. ఈ నంబర్‌లోని భూమి 421 సర్వే నంబర్‌లోని భూమి కలిసి ఉందని ఈ నంబర్‌లోని 18 ఎకరాల 36 గుంటలపై హైకోర్టులో కేసు ఉందంటూ గ్రామానికి చెందిన మల్లయ్య జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు శనివారం ఎస్‌ఐ శ్రీనివాసులు, తహసీల్దార్ కార్తీక్ పరిశీలించారు. రెండు సర్వే నంబర్‌లకు మధ్యన గెట్టు ఏర్పాటు చేసి 263లో వెంచర్ చేసుకోవాలని, కేసు ఉన్నందున 421లో ఉన్న భూమిలోకి వెంచర్‌ను అనుమతించరాదని తెలియజేశారు.

సర్పంచ్‌ను పరామర్శించిన కేంద్ర మంత్రి

కల్వకుర్తి రూరల్: మండలంలోని గుండూరు సర్పంచ్ కిష్టారెడ్డి మాతృమూర్తి సుభద్రమ్మ కొద్ది రోజుల కిందట అనారోగ్యంతో మృత్యువాత పడ్డారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు ఆచారి శనివారం గుండూరుకు వెళ్లి సర్పంచ్ కిష్టారెడ్డిని పరామర్శించారు. సర్పంచ్‌కు ధైర్యం చెప్పారు.

నాయకుల సంతాపం

చారకొండ: మండలంలోని చంద్రాయన్‌పల్లికి చెందిన కొట్ర శంకర్(39) ఇటీవల అనారోగ్యానికి గురయ్యాడు. శనివారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతిచెందాడు. శంకర్‌కు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. గ్రామ నాయకులు సంతాపం తెలియజేశారు.